## కాంగ్రెస్ గ్యారంటీలను నమ్మొద్దు

■ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్.రాంకిషన్‌రావు



నవీపేటలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాంకిషన్‌రావు

నవీపేట, నవంబర్ 28: అధికారం కోసం కాంగ్రెస్ ప్రకటించిన ఆచరణ సాధ్యంకాని ఆరు గ్యారంటీలను ప్రజలు నమ్మి మోసపోవద్దని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్.రాంకిషన్‌రావు కోరారు. మండలకేంద్రంలో మంగళవారం ఏర్పాటుచేసిన ఆరె కటిక సంఘ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 50 ఏండ్లలో కాంగ్రెస్ చేయని అభివృద్ధిని.. సీఎం కేసీఆర్ పదేండ్లలో చేసి చూపారని అన్నారు. కర్ణాటకలో ఆచరణ సాధ్యంకాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వాటిని అమలుచేయకపోవడంతో అక్కడి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో బాసర సరస్వతీ ఆలయానికి వెళ్లే భక్తుల కోసం రూ.55 కోట్ల వ్యయంతో జానకంపేట్ నుంచి ఫకీరాబాద్ వరకు ఫోర్‌లేన్ బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. మండలకేంద్రంలో ఎమ్మెల్సీ కవిత సహకారంతో రూ.1.50 కోట్ల వ్యయంతో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసినట్లు ఆయన గుర్తుచేశారు. ఎమ్మెల్సీ కవిత ఇటీవల రూ.5 కోట్ల నిధులను మంజూరు చేయించి, మండల కేంద్రంలో రోడ్లు, మురికి కాలువల నిర్మాణం పూర్తి చేయించారని పేర్కొన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి కృషిచేసిన బీఆర్ఎస్ పార్టీకే మద్దతు ప్రకటించి ఓటు వేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆరె కటిక సంఘం నాయకులు బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు బీడీ దాస్, పార్టీ సీనియర్ నాయకులు తెడ్డు పోశెట్టి, ప్రభాకర్‌రావు, మాజీ జడ్పీటీసీ సాయిబాబాగౌడ్, నాయకులు డి.శ్రీనివాస్, ఆరె కటిక సంఘం నాయకులు లచ్చురాం, శ్రీనివాస్, ఆరె కటిక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కు మాదిగ సంఘాల మద్దతు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాదిగ సంఘాల నాయకులు

శక్కర్‌నగర్, నవంబర్ 28: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకే మద్దతు ప్రకటిస్తూ వారి విజయానికి కృషి చేస్తాయని మాదిగ సంఘం యునైటెడ్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న అన్నారు. బోధన్ పట్టణంలోని ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలు మాదిగలను ఓట్లకోసమే వాడుకుంటున్నాయని విమర్శించారు. సీఎం కేసీఆర్ దళిత బంధు పథకం ద్వారా రూ.10లక్షల ఆర్థిక సాయం అందజేసి దళితుల జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. బీజేపీ మతతత్వ పార్టీ అని, కాంగ్రెస్ దళితులను ఓట్ల కోసమే వాడుకుంటున్నదని ఆరోపించారు. మందకృష్ణ మాదిగను అడ్డం పెట్టుకొని ఎస్సీ వర్గీకరణ చేస్తామని బీజేపీ చెప్పడం సిగ్గుచేటన్నారు. మాదిగలమంతా ఎమ్మెల్యే మహ్మద్ షకీల్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో దండోరా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కనకరాజు మాదిగ, టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఇటుక రాజు, దండోరా జాతీయ అధ్యక్షుడు వేముల బలరాం, జిల్లా ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

## రామడుగులో వారాంతపు సంత ప్రారంభం

ధర్పల్లి, నవంబర్ 28 : మండలంలోని ప్రాజెక్టు రామడుగులో వారాంతపు సంతను సర్పంచ్ పుష్పా సుబేందర్, వైస్ ఎంపీపీ నవీన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వారాంతపు సంతను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామపెద్దలు రాజారెడ్డి, మల్లయ్య, గంగారాం, నర్సయ్య పాల్గొన్నారు.

## మహాత్మా జ్యోతిబాపూలే వర్ధంతి

సిరికొండ, నవంబర్ 28 : మండలంలోని సత్యశోధక్ పాఠశాలలో మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని పాఠశాల చైర్మన్ ఆర్.నర్సయ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సామాజిక విప్లవోద్యమ పితామహుడు, గొప్ప సంఘ సంస్కర్త, మానవతావాది, సత్యశోధక్ సమాజ్ స్థాపకుడు మహాత్మాజ్యోతిరావు పూలే అన్నారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాండ్ పేపర్లతో కాంగ్రెస్ నాయకుల కొత్త డ్రామా

- మొసలి కన్నీళ్లకు బలైతే వచ్చే ఐదేండ్లు కన్నీళ్లే..
- కేసీఆర్ తెలంగాణ బిడ్డల కోసమే తెలంగాణ తెచ్చిండు...
- నిరుద్యోగులను మోసం చేస్తున్నది కాంగ్రెస్, బీజేపీలే
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఖలీల్‌వాడి, నవంబర్ 28 : బాండ్‌పేపర్ల పేరిట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త డ్రామాకు తెర తీశారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ప్రజలకు కాంగ్రెస్ నాయకులు బాండ్ పేపర్ రాసిచ్చి, మోసం చేస్తున్నారని అన్నారు. మొసలి కన్నీళ్లకు బలైతే రానున్న ఐదేండ్లు కన్నీళ్లు తప్ప ఏమీ మిగలవని అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 137 ఏండ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీకి చెందిన జీవన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, భట్టి విక్రమార్క తదితర నాయకులు కూడా బాండ్ పేపర్ రాయాల్సిన పరిస్థితి ఏర్పడిందంటే.. ప్రజల్లో కాంగ్రెస్ ఎంత విశ్వాసం కోల్పోయిందో చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ అన్నారు. కర్ణాటక ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ఇదే డ్రామా చేసిందని, 223 సీట్లలో పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థులు.. హామీలను అమలు చేస్తామని బాండ్ పేపర్లు రాయడం విడ్డూరమన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోయారని తెలిపారు. కర్ణాటకలో మహిళలకు రూ.2వేల పెన్షన్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ తదితర హామీలను ఇంకా అమలుచేయనేలేదన్నారు. కర్ణాటకలో 2 లక్షల 60 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. రాహుల్‌గాంధీ ప్రతి సభలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోగా ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పారని, వంద రోజులు పూర్తయినా వాటి ఊసే లేదని అన్నారు. దీనిని యువత గమనించాలని కోరారు. కర్ణాటకలో బియ్యం లేకపోవడంతో పంపిణీ కూడా చేయడం లేదని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమని చెప్పి, బస్సుల సంఖ్యను భారీగా తగ్గించారని వివరించారు.

బీజేపీ పాలిస్తున్న హర్యానా నిరుద్యోగంలో నంబర్ వన్ స్థానంలో ఉందని, కాంగ్రెస్ పాలిస్తున్న రాజస్థాన్ రెండో స్థానంలో ఉందని తెలిపారు. మధ్యప్రదేశ్‌లో మొదట కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. వాళ్ళు వాళ్లే కొట్టుకొని బీజేపీ ప్రభుత్వానికి అధికారాన్ని అప్పగించారని తెలిపారు. తెలంగాణలో 2 లక్షల 32 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వేశామని, లక్షా 60 వేల మందిని భర్తీ చేశామని తెలిపారు. ప్రైవేట్‌లో 30 లక్షల ఉద్యోగాలు భర్తీ అయ్యాయని చెప్పారు.

తెలంగాణ కన్నా ఎక్కువ ఉద్యోగాలు ఇతర రాష్ట్రాల్లో ఇస్తే ఒక్క ఓటు కూడా అడుగబోమని అన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో 13 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే ఒక్క జాబ్ కూడా ఇవ్వలేదని స్పష్టం చేశారు. తెలంగాణలో యువతతో బీజేపీ నాయకులు మీటింగ్‌లు పెట్టడం ఆశ్చర్యంగా ఉందన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ బిడ్డల కోసమే స్వరాష్ట్రాన్ని సాధించారని, రాష్ట్ర బిడ్డల కోసమే కేసీఆర్ పని చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో బోధన్ ఎమ్మెల్యే షకీల్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## పోలింగ్ సిబ్బంది థర్డ్ ర్యాండమైజేషన్ పూర్తి

నిజామాబాద్ స్పోర్ట్స్, నవంబర్ 28 : ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ సిబ్బందికి మూడో విడుత ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకుల సమక్షంలో మంగళవారం పూర్తిచేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు నేతృత్వంలో కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ హాలులో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ థర్డ్ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. సాధారణ పరిశీలకుడు ఎం.సుబ్రాచక్రవర్తి, లలిత్ నారాయణ్‌సింగ్ సందూ, గౌతంసింగ్ ర్యాండమైజేషన్‌ను నిశితంగా పరిశీలించారు. జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులను, వోపీవోలతో కూడిన బృందాలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు.

వీరికి ఇప్పటికే పలు విడుతల్లో ఎంపిక చేసిన వివిధ కేంద్రాల్లో మాస్టర్ ట్రైనర్లతో పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించామని కలెక్టర్ పరిశీలకుల దృష్టికి తీసుకువచ్చారు. జిల్లాలో మొత్తం 1,549 పోలింగ్ కేంద్రాలుండగా 7,458 మందిని పోలింగ్ విధుల కోసం నియమించినట్లు వెల్లడించారు. 20 శాతం రిజర్వ్ సిబ్బంది సైతం అందుబాటులో ఉంటారని చెప్పారు. ఎన్నికల సంఘం ఆదేశాలకనుగుణంగా ప్రతి నియోజకవర్గ పరిధిలో పోలింగ్ నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఐదు పోలింగ్ కేంద్రాల చొప్పున మహిళా బృందాలను, ఒక దివ్యాంగుల బృందం, ఒక యువతతో కూడిన పోలింగ్ బృందాలను ఎంపిక చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ ప్రక్రియను కూడా పూర్తి చేశారు. అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, సీపీవో బాబూరావు, ఎన్ఐసీ అధికారి రవికుమార్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా చూడాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- సీపీతో కలిసి కౌంటింగ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ స్పోర్ట్స్, నవంబర్ 28 : రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన తుది ఏర్పాట్లలో ఏ చిన్న తప్పిదానికి తావులేకుండా పకడ్బందీగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర బాలికల పాలిటెక్నిక్ కళాశాలలతోపాటు సీఎస్ఐ కాలేజీలో ఏర్పాటుచేసిన కౌంటింగ్, డిస్ట్రిబ్యూషన్ రీసివింగ్ సెంటర్లను ఆయన సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ మకరంద్, రిటర్నింగ్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. నిజామాబాద్ అర్బన్, రూరల్, బోధన్, ఆర్మూర్, బాల్కొండ, బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు, ఎన్నికల సామగ్రి పంపిణీ, పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను భద్రపర్చేందుకు స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద చేసిన ఏర్పాట్లు, వసతులను పరిశీలించి అధికారులకు కీలక సూచనలు చేశారు. పోలింగ్ సామగ్రి పంపిణీ కోసం సరిపడా సంఖ్యలో కౌంటర్లను ఏర్పాటు చేసుకోవాలని, సిబ్బంది సకాలంలో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లేందుకు వీలుగా వాహనాలను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామగ్రి పంపిణీ సమయంలోనే ఈవీఎంల పనితీరుపై ప్రయోగాత్మకంగా వివరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెక్‌లిస్ట్ ప్రకారంగా పోలింగ్ సామగ్రిని కట్టుదిట్టమైన భద్రత నడుమ నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లాలా చూడాలన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లతో పాటు కౌంటింగ్ హాల్స్, స్ట్రాంగ్‌రూంలను పరిశీలించి.. పలు మార్పులు, చేర్పులను సూచించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్దసీసీ కెమెరాలను అమర్చాలని, బందోబస్తు సిబ్బందితోపాటు అభ్యర్థులు, వారి ఏజెంట్లకు కేటాయించే గదుల్లో మానిటర్లను అమర్చి పర్యవేక్షణ జరుపాలన్నారు. తాగునీరు, విద్యుత్, కౌంటింగ్ టేబుల్స్, కౌంటర్లు, ఇతర అన్ని ఏర్పాట్లను నిశితంగా పరిశీరించారు. కలెక్టర్ వెంట అదనపు డీసీపీ జయరాం, ఆర్డీవో రాజేంద్రకుమార్, మెప్మా పీడీ రాజేందర్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.